దూరం

...కి అడుగు పెట్టిన కొడుకును చూడగానే "ఇంటర్వ్యూ ఎలా
...ని అడగాలనుకున్నాడు నిరంజనం.
అడగలేకపోయాడు. నోట్లోంచి మాట బయటకు రాలేదు.
క్లిష్టమైన పనేమీ కాదు గాని, అడిగిం తర్వాత అతని దగ్గర్నుంచీ
సమాధానం వస్తుందోనని ఆ పని చెయ్యలేకపోయాడు.
...ఉద్యోగమైనా వీడికొస్తే బావుండు. తను వూపిరి పీల్చు...

...నాన్నా! నీకు వనజగారు తెల్సా?" హఠాత్తుగా శేఖర్ అడిగిన
...కి ఉలిక్కిపడ్డాడు నిరంజనం.

...!

...ళుక్కుమంది ఆ పేరు విని...
...చేస్తోందో ఇప్పుడు? బహుశా తనూ ఇలానే సంసార బాధ్యతల్లో
... వుండి వుంటుంది! అయినా వనజ వీడికెలా తెల్సు?

...వనజ?" ఆతృతని అణచుకుంటూ అడిగాడు నిరంజనం.

...విడే నాన్నా!... చిన్నప్పుడు నువ్వు కొన్నాళ్ళు వాళ్ళింట్లో
...వుకున్నావట. వాళ్ళ నాన్నగారు మాష్టారు... ఇవాళ నన్ను
...చేసింది ఆమే!" ఎంతో ఆనందంగా చెప్పుకుపోతున్నాడు

"నువ్వు ఫలానా అని ఆవిడకెలా తెల్సు?" ఇన్నాళ్ళ తర్వాత వనజ ఇలా హఠాత్తుగా దర్శనమివ్వడమేకాక ఇంకా తనని గుర్తుపెట్టుకోవడం ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ అనిపించింది నిరంజనంకి. ఒక వేళ గుర్తున్నా తన కొడుకునెలా గుర్తించగల్గింది? అతనికి అంతా అయోమయంగా వుంది.

"ఏముంది నాన్నా, వెరీ సింపుల్! అప్లికేషన్ మీద తండ్రి పేరుంటుంది కదా? నేను లోపలికి వెళ్ళగానే ఆమె అడిగిన మొదటిప్రశ్న 'నువ్వు నిరంజనం గారి అబ్బాయివా?' అని..."

"నువ్వేం జవాబు చెప్పావ్?"

'ఏ నిరంజనంగారి అబ్బాయి ననుకుంటున్నారు?" అని అడిగాను. మనింటిపేరు చెప్పడమే కాకుండా వూరుపేరు కూడా చెప్పి, మీరు కొన్నాళ్ళు వాళ్ళ యింట్లోవుండి చదువుకున్నట్లు కూడా చెప్పారు. ఆ తర్వాత ఆవిడ 'మీరేం చేస్తున్నారు? ఎక్కడ వున్నారు? ఎలా వున్నారు?' మొదలైన ప్రశ్న లడిగారే కాని ఇంటర్వ్యూ చేయలేదు. బయటికి వచ్చేసేటప్పుడు 'మా యింటికి వస్తారా?' అని అడిగాను. 'వస్తానంటే సాయంత్రం వచ్చి తీసుకు వెళ్తాను' అని కూడా చెప్పాను.

'ఇక్కడకు వచ్చి నువ్వు నన్ను తీసుకువెళ్ళడం బావుండదు. అదీకాకుండా అర్జెంట్‌గా ఇవాళ సాయంత్రం ట్రైన్‌లోనే నేను హెడ్ ఆఫీస్‌కి వెళ్ళిపోవాలి. టికెట్టు కూడా రిజర్వ్ చేసుకున్నాను. ఏ మాత్రం వీలున్నా మీ నాన్నగార్ని ట్రైన్ దగ్గరకు రమ్మని చెప్పు' అంది..."

వనజకి తనమీద వున్న అభిమానం ఇంకా అలానే వుందన్నమాట! ఆనందంతో వుక్కిరిబిక్కిరైపోయాడు నిరంజనం.



"నాన్నా! సాయంత్రం నువ్వు ట్రైన్ దగ్గరకి వెళ్ళినప్పుడు ఒక్క-మాటన్నావంటే చాలు, నాకు వుద్యోగం గ్యారంటీ. నువ్వంటే ఆమెకి అంత అభిమానం!"

కొడుకు మాటలు నవ్వు తెప్పించాయ్ నిరంజనంకి. తన జీవితంలో అతి ముఖ్యమైన విషయాన్నే ఆమె నడగలేకపోయాడు. మరి ఈ విషయాన్ని అడగ్గలడా?

"నా విషయం చెప్తావ్ కదూ?" మళ్ళీ అడిగాడు శేఖర్.

"చూస్తాలే..." ఏం జవాబు చెప్పాలో అర్థంకాక అనేశాడు నిరంజనం.

పొంగుతున్న పాలమీద నీళ్ళు చల్లినట్లయింది శేఖర్ పరిస్థితి. తండ్రి ఆమెకు తన గురించి చెప్తాడు, తనకీ వుద్యోగం తప్పకుండా వస్తుంది అని ఎంతో ఆనందపడిపోయాడు...ప్చ్...

నిరుత్సాహంగా లోపలికి వెళ్ళిపోయాడు శేఖర్.

కొడుకునలా చూసేసరికి జాలేసింది నిరంజనంకి. తనమీద తనకే కోపం వచ్చింది.

తను వట్టి అసమర్థుడు. తనకోసమే కాదు, తనవాళ్ళకోసం కూడా ఎటువంటి పరిస్థితుల్లోనూ, ఎవరిదగ్గరా బయటపడి అడగలేడు. చిన్నప్పుడే పాతుకుపోయిన దురలవాటది! అమ్మని అన్నం పెట్టమని అడిగేవాడు కాదు. పెడితేనే తినేవాడు. లేకపోతే అలానే వుండేవాడు.

తండ్రిని పుస్తకాలు కొనిపెట్టమని కూడా అడిగేవాడు కాడు. ఒక సారి సైన్స్ రికార్డ్ కొనలేదని మాష్టారు క్లాసులోంచి బయటికి పంపించేశారు. అయినా పుస్తకం కోసం తండ్రి నడగలేకపోయాడు. ఆ విషయం పక్కింటి జయ ద్వారా తెలుసుకొని చితక్కొట్టాడు తండ్రి. అన్ని దెబ్బలయినా తను భరించగలిగాడు కాని, కావాలని అడగలేకపోయాడు. వయసుతోపాటే ఆ మొహమాటమూ పెరుక్కుంటూ వచ్చింది. ఎవరినీ ఏమీ అడగలేకపోయేవాడు. ఆ కారణంతో జీవితంలో ఎంతో పోగొట్టుకున్నాడు.

పడక్కుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు నిరంజనం. గతమంతా కళ్ళముందు మెదలసాగింది.

తను ఏడవ తరగతి చదువుతున్నప్పుడు హఠాత్తుగా సంవత్సరం మధ్యలో తండ్రికి ఆ వూరునించీ ట్రాన్స్‌ఫరైంది. తనని వెంట తీసు కెళ్ళాలంటే కష్టం. అక్కడికి ఇక్కడికి పుస్తకాల మార్పు...ఏంచేయాలో ఎవ్వరికీ అర్థంకాలేదు.

అటువంటి సమయంలో ఆపద్బాంధవుడిలా ఆదుకున్నారు రామా రావు మాష్టారు. ఆ సంవత్సరం పూర్తయేవరకూ తమింట్లోనే ఉంచుకొని చదివిస్తానని పట్టుబట్టారు. ఫలితంగా తల్లిదండ్రులు వెళ్ళిపోయినా తనా వూళ్ళోనే మిగిలిపోయాడు.

అప్పుడు తన వయసు పది సంవత్సరా లుంటాయేమో! మాష్టారు వాళ్ళింట్లో ఎంత ఆప్యాయంగా చూసినా దిగులు దిగులుగానే వుండేది.

వారం రోజులు ఎలాగో భరించగలిగాడు. ఆ తర్వాత తనవల్ల కాలేదు. వెంటనే వెళ్ళి అమ్మని చూడాలని మరీ మరీ అనిపించసాగింది. కానీ ఆ విషయం మేష్టారికి చెప్పలేదు.

పెరట్లోవున్న జామచెట్టుకింద కూర్చున్నాడు గుడ్లనీరు కుక్కు కుంటూ. వనజ అక్కడికి ఎప్పుడు వచ్చిందో కూడా తను గమనించలేదు.

''ఎందుకూ ఏడుస్తున్నావ్?" ఆమె ఆశ్చర్యంగా అడిగేసరికి వులిక్కి పడ్డాడు తను.

"అబ్బెబ్బే...ఏంలేదు..." గబగబా చొక్కాతో కళ్ళు తుడుచు కుంటూ అన్నాడు.

"నాకు తెల్సులే...మీ అమ్మ గుర్తుకొచ్చింది కదూ?"

ఆమె అంత ఆప్యాయంగా అడిగేసరికి భోరున ఏడ్చేశాడు. తనకన్నా ఆమె దాదాపు సంవత్సరం చిన్నది. అయినా రెండుమూడేళ్ళు పెద్దదాన్లా ఓదార్చింది. ఆమె ఓదార్పులో స్వాంతన దొరికింది తనకి. అక్కడ్నించీ బలవంతాన తనని ఆడుకోవడానికి లాక్కెళ్ళింది.

ఆ రోజునించీ ఆమె దాదాపు ఎప్పుడూ తనని వెన్నంటే వుండేది. కలిసే స్కూల్‌కి వెళ్ళేవాళ్ళు కలిసే వచ్చేవాళ్ళు, కలిసే ఆడుకునేవాళ్ళు, కలిసే భోంచేసేవాళ్ళు, కలిసే చదువుకునేవాళ్ళు...

రెండు మూడ్రోజులలా గడిచేసరికి తనూ ఆమెను విడిచి ఒక్క-క్షణం కూడా వుండలేని స్థితికొచ్చాడు!

వనజ సావాసంతో ఆరు నెలలూ ఆరు రోజుల్లా గడిచిపోయాయి. మర్నాడే తనా వూరు వదిలేస్తున్నాడు వనజను వదిలి వెళ్ళాలంటే ఎంతో బాధగా వుంది. ఆమే అదే పరిస్థితిలో వున్నట్లుంది. తను చివర పరీక్ష రాసి వచ్చేసరికి ఇంట్లో ఎక్కడా కనిపించలేదు.

సరాసరి జామచెట్టు దగ్గరకి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. అక్కడ దిగులుగా కూర్చొనుంది వనజ.

ఆమెనలా చూసేసరికి తనకి మరింత దిగులేసింది. తనకి దిగులు వచ్చినప్పుడల్లా ఆ చెట్టు దగ్గరికి వెళ్ళికూర్చుంటే, ఆమె వచ్చి ఓదార్చేది. ఇప్పుడామె అక్కడ దిగులుగా కూర్చుంటే, తనకి మరింత గుబులుగా వుంది. ఆమె నెలా ఓదార్చాలో అర్థం కావడంలేదు.

"ఏంటి వనజా, అలా వున్నావ్..." బొంగురు గొంతుతో ఆమె గడ్డాన్ని పైకెత్తుతూ అడిగాడు.

తను పలకరించగానే ఒక్కసారిగా బావురుమంది. తనకీ ఏడుపొచ్చేసింది.

"నువ్వేడవకు వనజా...నాకూ ఏడుపొచ్చేస్తోంది." వెక్కిళ్ళ మధ్య అన్నాడు తను.

"నువ్వు నన్ను విడిచి వెళ్ళిపోతూంటే ఏడుపు రాదేంటి?" అమాయకంగా అడిగింది. అప్పటి ఆమె కళ్ళని ఇప్పటికేకాదు, ఎప్పటికీ మరచిపోలేదు తను.

"ఇప్పుడు వెళ్ళిపోతే మాత్రమేం? మళ్ళా రానా ఏంటి? ప్రతీ శలవుల్లోనూ ఇక్కడికొస్తాను. ఇంచక్కా మనం తొక్కుడుబిళ్ళ, రింగాటలు ఆడుకోవచ్చు."

"నువ్వు తప్పకుండా ప్రతీ శలవుల్లోనూ ఇక్కడికి వస్తావా?" కళ్ళు తుడుచుకుంటూ ఆశగా అడిగింది.

"తప్పకుండా వస్తాను." ఆమె చేతిని చిన్నగా గిల్లుతూ నవ్వాడతను.

ఆమే నవ్వింది.

ఇద్దరూ ఒకళ్ళ చెయ్యి మరొకళ్ళు పుచ్చుకుని ఆనందంగా లోపలికి పరుగెట్టుకొచ్చేశారు.

తను ఆ వూరు వదిలి వచ్చేసేటప్పుడు కూడా ఆమె బస్సుదాకా కన్నీళ్ళతో సాగనంపింది.

మరో మూడు సంవత్సరాలదాకా తిరిగి ఆ వూరు వెళ్ళడానికి పడలేదు. వనజను చూడకుండా అన్నాళ్ళు గడపడం బాధే అయినా తప్ప లేదు.

తనెన్నిసార్లు అడిగినా 'ఇప్పుడంత దూరం ఎందుకు?' అంటూ కొట్టిపారేశారు తన మాటని అమ్మా, నాన్న. ఆఖరికి పంపిస్తేనేకాని అన్నం తిననని మారాం చేస్తే, యిక తప్పక పంపించారు. ఆనందంగా బయల్దేరాడు తను.

బస్సు దిగగానే కాళ్ళు చకచకా మేస్టారింటికేసి పడసాగాయి.

వనజ మనసులో ఇంకా తన స్థానం అలానే వుందా? అప్పటిలా ఆప్యాయంగా తనతో మాట్లాడుతుందా?-మేష్టారింటికి చేరుకునేవరకు రకరకాల ఆలోచనలు తన మనసుని వుక్కిరిబిక్కిరి చేయసాగాయి.

"ఏమేవ్! నిరంజనం వచ్చాడు..." తనని చూస్తూనే గట్టిగా కేకేశారు మాస్టారు.

అందరూ ఒక్కసారిగా బయటికొచ్చారు.

వనజ కూడా!

ఆమెను చూడగానే తన కళ్ళు తళుక్కున మెరిసాయ్.

"ఇప్పుడేనా బాబూ రావడం? అంతా కులాసామేనా?" పలకరించారు మేష్టారి భార్య.

"కులాసాయేనండీ! మావయ్యా వాళ్ళింటికి బయల్దేరాను. చాలా కాలమైంది కదా అని దార్లో ఇక్కడ దిగాను..." తనకి తెలియకుండానే అబద్ధం ఆడేశాడు. అక్కడికే వచ్చానని చెప్పడం తనవల్ల కానిపని!

"అంతేగాని మా ఇంటికి రావాలని రాలేదన్నమాట!" నిష్ఠూరంగా అంది వనజ. అప్పుడుగాని అర్థంకాలేదు-తను మొహమాటంలో ఏమేమో మాట్లాడి వాళ్ళని నొప్పించాడని!

"అబ్బె...అలా కాదు..." నసిగాడు తను.

"అతను వచ్చి రాకముందే ఏమిటా దండయాత్ర వనజా? ముందతన్ని లోపలికి రానివ్వు." మేష్టారి మందలింపుతో వాకిటికి అడ్డం తప్పుకుని దారినిచ్చింది. అంతా లోపలికి వెళ్ళి హాల్లో కూర్చున్నారు.

మూడు సంవత్సరాల తర్వాత వాళ్ళందర్నీ, అప్పుడు తను తిరిగిన ప్రదేశాల్ని చూస్తుంటే మనసు తియ్యటి బాధతో నిండిపోసాగింది.

ఆ రాత్రి బాగా పొద్దుపోయేవరకు తను, వనజ, ఆమె
ఃజని కబుర్లు చెప్పుకుంటూ గడిపారు.

పొద్దున్నే తను బయల్దేరాడు.

ఁండు రోజులుండకూడదూ?" ఎవ్వరూ లేని సమయం
, నెమ్మదిగా అడిగింది వనజ.

గ్గరగా ఆమెను చూస్తుంటేగాని తను గుర్తించలేక
ఓలో వయసు తెస్తున్న మార్పుల్ని! ఆమె దగ్గరగా
కెన్నడూ కలగని వింత అనుభూతి కలగసాగింది!

వుందామనే వుంది. కానీ ఇవాళ అర్జంటుగా ఇంటికి వెళ్ళి
ః చెప్పాను అమ్మతో..."

ంటావా?"

మాష్టారటుగా రావడంతో వులిక్కిపడి ఇద్దరూ దూరంగా
ర్వాత మళ్ళీ ఆ వూరు వెళ్ళడం పడలేదు.

ః సంవత్సరాల తర్వాత అనుకోకుండా విజయవాడ
ంచింది.

ఏదో కాలేజిలో చదువుకుంటోంది. శలవులకు ఇంటికి
ఃతోపాటే ఇంటికి రమ్మని బలవంతం చేసింది. కానీ వుద్యో
ీ త్తలు కావడంతో ఆమెవెంట వెళ్ళలేకపోయాడు. ఆఫీస్
వాడ వెళ్ళిన తను మర్నాడు ఎటువంటి పరిస్థితుల్లోనూ
వ్వాలి. ఇద్దరూ అరగంట లోపలే విడిపోయారు.

ఆమె రూపం మాత్రం మనసులో అలానే ముద్రించుకు
ళ్ళనేది చేసుకుంటే ఆమెనే చేసుకోవాలనికూడా నిశ్చయించు

కానీ ఎలా? ఈ విషయాన్ని ఆమెకి తెలియజేసేదెలా?

ఉత్తరం రాస్తేనో...?

అమ్మో! ఇంకేమైనా వుందా? ఈ విషయం ఇంట్లో వాళ్ళందరికీ తెలిసిపోదూ... ఇంతవరకూ తననెంతో మంచివాడుగా గౌరవించినందుకు బాధపడతారు. తనని ఛీదరించుకుంటారు. నో ... అలా జరగడానికి వీల్లేదు. వాళ్ళందరి సంగతెలా వున్నా వనజకి తనంటే ఎలాంటి అభిప్రాయముందో? ఆ విషయం తెలీకుండా తనెలా బయటపడతాడు? ఒక వేళ్ళ ఆమెకు తనంటే ప్రత్యేక అభిప్రాయం లేకపోతే ఆమెను బాధించినవాడు కాడూ? తానామెను బాధించలేడు!

బలవంతాన ఆ కోరికను మనసులోనే తొక్కేశాడు.

ఏ మొహమాటమైతే వనజని తననించీ దూరంచేసిందో అదే మొహమాటం రాధని తన భార్యగా చేసింది.

తన కూతుర్ని చేసుకొమ్మని వచ్చిన మావయ్యని, ఆయన మాటని బలపరిచే అమ్మానాన్నలని తను కాదనలేకపోయాడు. ఫలితంగా రాధ తన జీవిత భాగస్వామి అయిపోయింది.

గడచిన ఈ ఇరవై సంవత్సరాల్లోనూ వనజ తనకెన్నోసార్లు గుర్తొచ్చింది. ఆమెను చూడాలనే కోరిక కూడా ఎన్నోసార్లు కలగింది. కాని వనజ తనకు పరాయి స్త్రీ. అందుకే ఆ ఆలోచనల నన్నిటినీ మనసులోనే సమాధి చేసేశాడు.

"మీరు బండి దగ్గరకు వెళ్తున్నారా? లేదా?" రాధ పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాడు నిరంజనం.

"ఎందుకూ?"

"ఎందుకేమిటండీ నా మొహం! వెనకటికి మీలాటివాడే రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందీ అని అడిగాట్ట! సాయంత్రం రైల్లోనే వెళ్ళిపోతున్నానని చెప్పిందట కదా...!"

"బావుంది. ఆవిడ వెళ్ళిపోతుంటే నేనెందుకు వెళ్ళాలి స్టేషన్‌కి?" వనజని చూడాలనే వున్నా ఆ భావాన్ని మనసులోంచి తోసివేయాలని ప్రయత్నిస్తూ అన్నాడు నిరంజనం.

"ఆవిడ్ని చూట్టానికి కాదండీ మిమ్మల్ని స్టేషన్‌కి వెళ్ళమంటూంది-మనవాడి వుద్యోగ విషయం హెచ్చరించడానికి!"

"బావుంది ఇంతకాలంతర్వాత ఆవిడ కనిపించి మర్యాదగా పలకరించేసరికి రికమండేషన్లకి బయల్దేరనా? నావల్ల కాదు!" అంతవరకూ మనసులో వున్న మాటనే బయటికి వెళ్ళగక్కేశాడు నిరంజనం.

ఆ మాటలు రాధని రెచ్చగొట్టాయి.

"పెళ్ళయినప్పట్నుంచీ చూస్తూనేవున్నాను. అయినదానికీ కానిదానికీ ప్రతిదానికి మొహమాటం! మీ మొహమాటంతో మేమెన్ని బాధలు పడ్డా పర్వాలేదు. మీరు మాత్రం మీ పద్ధతి మార్చుకోరు...! మీకు నమస్కారం పెడతాను. ఈ ఒక్కసారికి మీ మొహమాటాన్ని విడిచిపెట్టి ఆవిడకి చెప్పండి చాలు... ఇకముందు మా అందరి సంగతీ వాడే చూసుకుంటాడు..." కళ్ళనీళ్ళ పర్యంతమైంది రాధ.

"నాన్నా!... ఆవిడతో నువ్వొక్కమాట చెప్తే చాలు..." జాలిగా దగ్గరకొచ్చాడు శేఖర్.

తన జీవిత సమస్య విషయంలోనే ఆమెముందు బయటపడలేకపోయాడు. ఇప్పుడీ విషయంలో బయటపడగలడా?

తప్పదు! ఆమె కెలాగైనా చెప్పాలి. తన బలహీనతవల్ల తన వాళ్ళంతా బాధపట్టానికి వీల్లేదు. స్టేషన్‌కి వెళ్ళితీరాలి. వనజను కలవాలి. శేఖర్ విషయం ఆమెతో మాట్లాడాలి—

వెంటనే బయటికి బయల్దేరాడు నిరంజనం. ఆయన ఎక్కడికి వెళ్తోందీ అర్థంగాక అలానే చూస్తూ అక్కడే నిలబడిపోయారు తల్లీ కొడుకులు.

* * *

వెళ్ళాలా? వద్దా? అనే సందిగ్ధంలో అటు ఇటు తిరిగి ఎప్పటికో స్టేషన్‌కి చేరుకున్నాడు నిరంజనం.

బండి బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

గేటు దగ్గర నిలబడి ఆత్రంగా ఎదురుచూస్తున్న వనజ అతన్ని చూడగానే "నిరంజనంగారూ!..." అంటూ ఆనందంగా కేకేసింది.

"అరె! మీరా?" ఆమెకోసం వచ్చినట్టు చెప్పలేక ఆశ్చర్యాన్ని నటిస్తూ అన్నాడు నిరంజనం.

ఆమెనక్కడ చూడడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించకపోయినా, వయసు తెచ్చిన హుందాతనంతో నిండుగా వున్న ఆమె రూపం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

అవన్నీ వయసుతో వచ్చే మార్పులైనా అతని దృష్టిని ప్రత్యక్షంగా ఆకర్షిస్తున్నాయ్!

ఎంత మారిపోయింది! అప్పటి చిలిపి వనజకు, ఈ వనజకూ ఎక్కడా పోలిక లేదు! విస్తుపోయి ఆమెను చూస్తూ నిలబడిపోయాడు నిరంజనం.

"అదేంటి? మీరు నాకోసం కాదా వచ్చింది!" ఆశ్చర్యంతోను, బాధతోను ఆమె మాటలు నీరసంగా వచ్చాయి.

నిరంజనం మనసు కలతపడింది.

తను వచ్చింది ఆమె కోసమే! అయినా ఆ విషయాన్ని ఆమె ముందు చెప్పలేకపోయాడు, ఈ బలహీనత తనని వదల్దు...!

"మీవాడు చెప్పలేదా?" మళ్ళీ ఆమె ప్రశ్నించింది.

"చెప్పలేదు..." మొదటి అబద్ధాన్ని కప్పిపుచ్చుకోడానికి మరో అబద్ధం ఆడేడు.

రైలు గట్టిగా కూత వేసింది.

"ఇక్కడ కొన్ని ఇంటర్‌వ్యూలు కండక్ట్ చేయడానికి నిన్న వచ్చాను. నాకు మీరిక్కడ వుంటున్నట్లు ముందే తెలిసుంటే ఖచ్చితంగా మీ ఇంటికి వచ్చుండేదాన్ని..." చిన్నగా నవ్విందామె.

కంగారుపడ్డాడు నిరంజనం.

"నువ్వీ వూరు వచ్చావని తెలిస్తే నేను మాత్రం వూరుకునేవాణ్ణా ఏం! ఇంతకీ ఇప్పుడేవూళ్ళో వుంటున్నారు?" అడిగాడు.

జవాబు చెప్పిందామె.

మరోసారి కూతవేసి నెమ్మదిగా బయల్దేరింది రైలు.

"మీ ఆయన కూడా అక్కడే పనిచేస్తున్నారా? ఏం చేస్తున్నారు?" అతనడిగిన ప్రశ్నలకు ఆమె చెప్పిన జవాబు రైలు శబ్దంలో కలిసిపోయింది.

దూరమైపోతున్న ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు కన్నీళ్ళు పొరలగుండా చూసుకోసాగారు.

అతని మొహమాటమే ఆమెను కన్యగా మిగిల్చిందని అతనికి తెలీదు. అంతేకాదు-తనలాగే మరికొన్ని జీవితాలు కూడా అతని మొహమాటానికి బలై పోగూడదని ఆమె శేఖర్‌కి ఆ ఉద్యోగం వచ్చేటట్లు చేసిన విషయం కూడా అతనికి తెలీదు. అతని కొడుకే తన కొడుకనుకొంటున్న ఆమెకు ఆ విషయం అతనికి తెలీడం కూడా ఇష్టంలేదు. ఎప్పుడూ ఒకళ్ళ మనసులో మరొకళ్ళు నిండుకొని వున్నా ఆ విషయాన్ని ఇద్దరూ బయట పెట్టలేదు. వాళ్ళమధ్య దూరం ఎప్పటికీ తరగనిది! *

(ఆంధ్రపత్రిక 1978.)